# కమలం..కకావికలం

- బీజేపీలో ఇంకా ఖరారుకాని టికెట్లు
- ఉమ్మడి జిల్లాలోని ఆశావహుల్లో టెన్షన్
- ప్యారాచూట్ నేతల కోసం ఎదురుచూపు
- కన్నెత్తి చూడని ఇతర పార్టీల నాయకులు
- కమలం నేతల పోకడనచ్చక బీసీ నేతల జంప్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికలు సమీపిస్తున్నా బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో ఆ పార్టీ ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించినా ఇంకా కమలం లిస్ట్ రాకపోవడంతో అన్ని నియోజకవర్గాల నేతల్లో ఆందోళన వ్యక్తం అవుతున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పోటీ చేయడానికి అభ్యర్థులు లేక ఇతర పార్టీల నేతలు వస్తారని ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది. పార్టీలో టికెట్లు ఆశించిన వారికి మొండిచెయ్యి చూపడంతో వారంతా ఇతర పార్టీల్లో చేరిపోయారు. మహబూబ్‌నగర్ టికెట్‌ను ఆశించిన నేతలకు కంగుతినిపిస్తూ రాజకీయ అనుభవం లేని మాజీ ఎంపీ కుమారుడికి ఇవ్వడంతో అసంతృప్తి చెందిన ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ కారెక్కేశారు. గద్వాల నియోజకవర్గంలో కూడా పార్టీ జాతీయ కార్యదర్శి డీకే అరుణ పోటీకి వెనుకంజ వేస్తున్నారు. ఇక్కడ గెలిచే అవకాశం లేదని తెలిసి బీసీలకు టికెట్ ఇప్పిస్తానని చెబుతున్నా పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలో ఆ పార్టీ నేతలు పోటీ చేయడానికి ఆసక్తి చూపడం లేదు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల్లో పోటీ చేయాలంటేనే జంకుతున్నారు. కాస్తోకూస్తో బలం ఉందనుకున్న నారాయణపేట జిల్లాలో అభ్యర్థులు ఖరారు చేయకపోవడంతో నేతల్లో అసంతృప్తి రగులుతున్నది. జిల్లాలో పార్టీ వర్గాలుగా చీలిపోయింది. పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి డీకే అరుణలు వర్గాలుగా విడిపోవడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. కాగా, ముందు నుంచి పార్టీలో ఉన్న నేతలకు సరైన గౌరవం దక్కకపోవడంతో చాలామంది ఇతర పార్టీల్లో చేరుతున్నారు. ఇదంతా చూస్తుంటే మళ్లీ 2018 ఎన్నికల సీన్ రిపీట్ అవుతుందని, పోటీ చేసి లాభం లేదని భావిస్తున్నారు.

**నేతల్లో టికెట్ల టెన్షన్..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీజేపీ నుంచి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఇంకా టికెట్లు ఖరారు చేయకపోవడంతో ఆశావహుల్లో టెన్షన్ మొదలైంది. ఎన్నికలకు ఇంకా 30రోజులే సమయం ఉన్నందునా ఇంకెప్పుడు అభ్యర్థులను ప్రకటిస్తారని నిలదీస్తున్నారు. బీజేపీ ఇప్పటివరకు ప్రకటించిన తొలి జాబితాలో కల్వకుర్తి, కొల్లాపూర్ అభ్యర్థులను మాత్రమే ఫైనల్ చేసింది. ఇటీవల మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి మాజీ ఎంపీ కుమారుడికి టికెట్ కేటాయించింది. మిగితా తొమ్మిది నియోజకవర్గాల్లో ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టింది. కాగా జడ్చర్ల, అచ్చంపేట, కొడంగల్, అలంపూర్ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఎవరూ సుముఖంగా లేరు. అయితే కల్వకుర్తికి చెందిన మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ ఇటీవల బీజేపీలో చేరారు. అతడిని జడ్చర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేయించేందుకు సమాయత్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలోని రెండు స్థానాల్లో పార్టీ నేతలు టికెట్ల కోసం కొట్టుకుంటున్నారు. ఇరువర్గాలు తమకే కావాలని పట్టుబడుతున్నాయి.

**గద్వాలలో బరిలో సందిగ్ధత..**

గత ఎన్నికల్లో గద్వాలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీఆర్‌ఎస్ సునామిలో కొట్టుకుపోయిన డీకే అరుణ ఆ తర్వాత వెంటనే బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి మళ్లీ ఓటమి పాలయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో డీకే అరుణకు కేంద్ర బీజేపీ నాయకత్వం జాతీయ కార్యదర్శి పదవి ఇచ్చింది. పార్టీ బలాన్ని పెంచుకునేందుకు యత్నించింది. కానీ డీకే అరుణ సొంత నియోజకవర్గంలోనే పరిస్థితులు తారుమారయ్యాయి. ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసినా ఈసారి ఎన్నికల్లో అసెంబ్లీకి కూడా పోటీ చేయాలని పార్టీ అగ్రనాయకత్వం ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆమె గద్వాల నుంచి పోటీకి విముఖత చూపిస్తున్నారు. తాను స్వయంగా చేసుకున్న సర్వేల్లో మూడోస్థానం రావడంతో పోటీకి వెనుకంజ వేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. గద్వాలలో బీసీ అభ్యర్థితో పోటీ చేయించనున్నట్లు పార్టీ నేతలు ప్రకటిస్తున్నారు. ఓడిపోయే సీటు మాకు అంటగడ్తరా అంటూ బీసీ నేతలెవరూ పోటీకి ముందుకు రాకపోవడంతో గద్వాలలో బీజేపీ పోటీ చేస్తుందా? లేక బీఆర్‌ఎస్‌కు భయపడి వెనుకంజ వేస్తుందా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

**తిరోగమనంలో బీజేపీ..**

ఎన్నికలకు ముందు దూకుడు మీదున్న బీజేపీ దగ్గర పడుతున్న కొద్దీ తిరోగమనం వైపునకు వెళ్తున్నది. రాష్ట్ర, జాతీయ నాయకత్వం ఏ కార్యక్రమం తీసుకున్నా పాలమూరు నుంచే ప్రారంభించినప్పటికీ తర్వాత పరిణామాలు పార్టీని కొలుకోలేని దెబ్బతీశాయి. పార్టీలోకి ఇతర బలమైన లీడర్లను చేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల పర్యటించారు. ఆశించిన స్థాయిలో నేతలెవరూ బీజేపీలో చేరలేదు. వనపర్తి జిల్లాలో జెడ్పీ చైర్మన్‌ను, ఇతర నాయకులను చేర్చుకోవడానికి ఈటల వచ్చినా ఫలితం లేకుండా పోయింది. బీజేపీ చేపట్టిన యాత్రలకు కూడా స్పందన రాకపోవడంతో రాష్ట్ర నేతలు ఖంగుతిన్నారు. మాజీ ఎమ్మెల్యే, ముదిరాజ్ నాయకుడు ఎర్రశేఖర్ పార్టీలో చేరి జిల్లా అధ్యక్షుడైనా ఆయనకు సరైన గౌరవం ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో బీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ టికెట్‌ను ఆశించిన బీసీ నేతకు ఇవ్వకపోవడంతో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ బీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ టికెట్ విషయంలో సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. మొత్తంపైన ఈ ఎన్నికల్లో సత్తాచాటుదామనుకున్న కమలనాథులకు గట్టిఎదురు దెబ్బలే తగులుతున్నాయి.

# గులాబీ జోష్

- బీఆర్‌ఎస్‌లోకి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి డాక్టర్ నాగం జనార్దన్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో జోష్ నెలకొంది. సీనియర్ రాజకీయ నాయకుడిగా, వ్యూహ చతురతకు మారుపేరుగా నిలిచిన నాగం వాస్తవాలను గుర్తించి ఎట్టకేలకు తెలంగాణ అభివృద్ధిలో సీఎం కేసీఆర్‌తో కలిసి నడిచేందుకు నిర్ణయించడం విశేషం. శాసనసభ ఎన్నికల వేళ సీఎం కేసీఆర్ వ్యూహంతో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించనుంది. నాగం జనార్దన్ రెడ్డి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేస్తూ తొలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ముందుండి వైద్యునిగానూ సేవ చేస్తూ ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయరంగంలోకి ప్రవేశించారు. నాగం 1948లో వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం నాగపూర్‌లో జన్మించారు. తల్లిదండ్రులు వెంకటస్వామి, నారాయణమ్మలు. మూడో తరగతి వరకు నాగపూర్‌లో, పీయూసీ వరకు నాగర్‌కర్నూల్‌లో అభ్యసించి వైద్యవిద్యను ఉస్మానియాలో పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు కల నాగం తెలంగాణ తొలిదశ ఉద్యమంలో పాల్గొన్నారు. తన పెళ్లి పత్రికలోనూ జై తెలంగాణ నినాదాన్ని ముద్రించుకోవడం ఆయనకే చెల్లింది. అలాంటి నాగం నాగర్‌కర్నూల్ నియోజకవర్గంతో పాటుగా ఉమ్మడి రాష్ట్రంలోనూ ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా పదవులకు వన్నె తీసుకొచ్చారు. వైద్యవిద్య పూర్తయ్యాక 1976లో నాగర్‌కర్నూల్‌లో వైద్యుడిగా జీవితం ప్రారంభించారు. దివంగత సీఎం ఎన్టీఆర్ పిలుపుతో 1983లో తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసి 52ఓట్ల స్వల్ప తేడాతో ఓటమితో రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టారు. కాగా 1985లో ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన 1989లో టిక్కెట్ దక్కక ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఓడిపోయారు. ఇక 1994లో మళ్లీ తెలుగుదేశంలో చేరి చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో నెంబర్ టూగా రాజకీయాలను నడిపారు. ఇలా 1995నుంచి 2004వరకు వరుసగా నాగం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా పని చేశారు. కాగా తెలంగాణకు వ్యతిరేకంగా టీడీపీ నిర్ణయించడంతో చంద్రబాబును ధిక్కరించడంతో 2011లో పార్టీ నుంచి బహిష్కరించడంతో 2012లో తెలంగాణ నగారా సమితిని స్థాపించి ఉప ఎన్నికల్లో పోటీ చేసి భారీ విజయం సాధించారు. నాటి పరిస్థితుల్లో తెలంగాణ సమితి నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సభ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి తెలంగాణ ఉద్యమానికి బలాన్ని తీసుకొచ్చింది. అయితే 2013లో మహబూబ్‌నగర్‌లో బీజేపీ తరఫున ఎంపీగా, 2014లో కాంగ్రెస్ నుంచి నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేశారు. ఈ ఎన్నికల్లో నాగంకే టిక్కెట్ వస్తుందని భావించిన ఆయన అనుచరులకు అవమానం జరిగింది. డబ్బుల సంచులకు బీఫాంలు అమ్ముకుంటూ పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాగంకు టిక్కెట్ ఇవ్వకుండా అప్పుడే పార్టీలోక వచ్చిన రాజేశ్ రెడ్డికి టిక్కెట్ కేటాయించడం జరిగింది. దీంతో నాగం కాంగ్రెస్ విధానాలను ఎండగడుతూ ఆ పార్టీకి సుదీర్ఘ రాజీనామా లేఖను విడుదల చేశారు. నియోజకవర్గంలో నాగంకు బలమైన క్యాడర్ ఉంది. వేలాది మంది అభిమానులు నాగంతో కలిసి నడిచేందుకు సిద్ధమయ్యారు. కీలక నేత బీఆర్‌ఎస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# మతి భ్రమించిన రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- పేగులు తెగితే మొండి కత్తి ఎలా అవుతుంది..?
- పిరికిపందల చిల్లర రాజకీయాలు మానుకోవాలి
- హత్యలు చేసేలా ప్రేరేపిస్తున్న కాంగ్రెస్
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్, అక్టోబర్ 31 : రేవంత్ రెడ్డి రౌడీ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటిని తెలంగాణ సమాజం క్షమించదని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం దారుణమన్నారు. మొండి కత్తి అని దుర్మార్గంగా మాట్లాడడం రేవంత్‌రెడ్డి మానసిక స్థితిని తెలియజేస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను మెప్పించి వారి మనసులు గెలవాలే తప్పా ఇలాంటి అరాచకాలు చేయడం పిరికి పంద చర్యగా మంత్రి అభివర్ణించారు. ఇలాంటి వారిని రాజకీయంగా పూర్తిగా భూస్థాపితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పొరపాటున అధికారం ఇస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతానని పగటి కలలు కంటూ కార్యకర్తలను రెచ్చగొట్టి వారితో దాడులు చేయించడం, తిరిగి సమర్థించుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి వస్తుందనే కుట్రతో ప్రభాకర్‌రెడ్డిని హత్య చేయించేందుకు ప్రయత్నించడం హేయమైన చర్య అన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక కుట్రతో ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీకి లక్షలాది మంది కార్యకర్తల బలగం ఉన్నదని, అనుకుంటే ఇలాంటి వారికి గుణపాఠం చెప్పగలమని, కానీ తమకు ఆ సంస్కృతి లేదన్నారు. ఒక్క క్షణం మా కార్యకర్తలు సహనం కోల్పోతే దాడి చేసిన వాడు ముక్కలు ముక్కలుగా అయ్యేవాడని తెలిపారు. చట్టంపై తమకు అపారమైన గౌరవం ఉన్నదని కార్యకర్తలు నిందితుడిని పోలీసులకు అప్పగించడం జరిగిందన్నారు. గన్‌మెన్‌లేకుంటే ఆ సమయంలో ప్రభాకర్‌రెడ్డి పరిస్థితి ఏమిటని, తలచుకుంటేనే ఎంతో ఆవేదన కల్గుతుందని తెలిపారు. కాపాడిన గన్‌మెన్‌కు సెల్యూట్ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి చికిత్సకు సంబంధించిన ఫొటోలను మంత్రి మీడియాకు చూపించారు. పోలీసులను బట్టలూడదీసి ఉరికించి కొడతామని రేవంత్ అన్నారని, టచ్ కూడా చేయలేరని హెచ్చరించారు. తెలంగాణ పోలీస్ పనితీరుతో దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచారని ప్రసంశించారు. సమావేశంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మూడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేశ్, ముడా డైరెక్టర్ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు శివరాజ్, నాయకులు శేఖర్, రామకృష్ణ, కృష్ణయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ దేశానికే ఆదర్శం

- కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ లేదు
- మంత్రి మహేందర్‌రెడ్డి

కోస్గి, అక్టోబర్ 31 : తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో లేవని, అన్ని రంగాల్లో అభివృద్ధిలో నెంబర్‌వన్ స్థానంలో రాష్ట్రం నిలిచిందని భూగర్భ గనులశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుండుమాల్ మండలం బోగారంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. ఆరు గ్యారెంటీలు ఇచ్చేది లేదన్నారు. ఆ పార్టీకే తెలంగాణలో గ్యారెంటీ లేదన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కొడంగల్‌లో పట్నం నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను కొడంగల్ నియోజకర్గంలో చేశారన్నారు. గుండుమల్ గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు చెప్పే మయమాటలు నమ్మొద్దన్నారు. నాయకులను డబ్బులతో కొనుగోలు చేస్తే ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. బలవంతంగా ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. అనంతరం గుండుమాల్, బోగారం గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సమావేశంలో ఎంపీపీ మధుకర్ రావు, జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ రవి, నాయకులు బాల్‌సింగ్, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్ రెడ్డి